ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 335 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 10 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## ఎన్నికల కమిషనర్ రాజీనామా..

లోక్ సభ ఎన్నికలకు ముందు అనూహ్య పరిణామం 2లో..

### హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటే

# నగర బహిష్కరణే

## బైరామల్ గూడ ఫ్లై ఓవర్ ప్రారంభించిన సీఎం రేవంత్



హైదరాబాద్, మార్చి 9 (ప్రభాత ఉదయం): ఎల్బీనగర్ పరిధిలోని బైరామల్ గూడ రెండో లెవల్ ఫ్లై ఓవర్ తో పాటు లూప్ ఫ్లై ఓవర్ ను సీఎం రేవంత్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఎస్ఆర్ డీపీ (స్ట్రాటజిక్ రోడ్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం)లో భాగంగా ఈ వంతెనల పనులు పూర్తి చేశారు. దాదాపు రూ.148.05 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ పై వంతెన వల్ల.. శంషాబాద్, ఓవైసీ ఆస్పత్రి నుంచి బీఎన్ రెడ్డి నగర్, నాగార్జున సాగర్ వైపు వెళ్లే వాహనాలకు, చింతలకుంట చెక్ పోస్ట్ అండర్ పాస్ మీదుగా హయత్ నగర్, విజయవాడ వైపు వెళ్లే వాహనదారులకు ఉపయోగపడనుంది. అలాగే, నల్గొండ, వరంగల్ ప్రాంతాలకు కూడా మెరుగైన రవాణా సదుపాయం కలుగుతుంది. ఇదే కూడలిలో ప్రస్తుతం 2 లూప్స్ నిర్మాణంలో ఉండగా పై వంతెన అందుబాటులోకి వచ్చింది. ఫ్లైఓవర్ మొత్తం పొడవు 1786.60 మీటర్లు కాగా.. వయాడక్ట్ భాగం పొడవు 1305.60 మీటర్లు, ర్యాంపుల పొడవు 481 మీటర్లుగా ఉంది. ఈ వంతెన ప్రారంభంతో బైరామల్ గూడ కూడలి సిగ్నల్ ఫ్రీగా మారింది. శంషాబాద్ విమానాశ్రయం, ఓవైసీ ఆస్పత్రి వైపు నుంచి నాగార్జునసాగర్, విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు ఈ పై వంతెన ఉపయోగపడుతుంది. జంక్షన్ లో ఈ వంతెన 'వై' ఆకారంలో విడిపోతుంది. వంతెనకు ఎడమవైపు వెళ్తే చింతలకుంట చెక్ పోస్ట్, కుడి వైపు వెళ్తే బీఎన్ రెడ్డినగర్ రోడ్డుకు కలుస్తాయి. హైదరాబాద్ నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. 'మూసీ నది మురికి కూపంగా మారడంతో జనం అనారోగ్యాల బారిన పడుతున్నారు. నగరంలో ..మిగతా 2లో




## నరేంద్రుడు.. గజేంద్రుడు

### కజిరంగా నేషనల్ పార్క్‌లో మోదీ సందడి

న్యూఢిల్లీ, మార్చి 9 (ప్రభాత ఉదయం): నరేంద్రుడు.. గజేంద్రుడు.. ఇదేంటి టైటిల్‌లా ఉంది కదా.. కానీ, ఈ వీడియో చూస్తే నిజంగా ఈ టైటిల్ కరెక్ట్‌గా సరిపోయింది అనిపిస్తోంది.. మొన్న లక్షద్వీప్, నేడు అసోం..ప్లేస్ ఏదైనా ప్రధాని మోదీ స్టైలే వేరు మరీ.. అసోంలోని కజిరంగా నేషనల్ పార్క్‌లో సందడి చేశారు. దేశ ప్రజలను మరోసారి సర్‌ప్రైజ్ చేశారు మోదీ. అసోంలోని కజిరంగ నేషనల్ పార్క్‌కు వెళ్లిన ప్రధాని ఏనుగుపై ఊరేగారు..నిజానికి ప్రకృతి అందాలన్నా.. పర్యాటక ప్రదేశాలను సందర్శించి అక్కడ గడపడం అన్నా మోదీకి చాలా ఇష్టం.. తాను ప్రధానిని అన్న విషయాన్ని మరచిపోయి అక్కడ అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలను అందిపుచ్చుకుంటారు..ఇలాగే మొన్న లక్షద్వీప్‌లో స్నార్కెలింగ్.. స్కూబా డైవింగ్ చేసి చేసి దేశ ప్రజలను ఆశ్చర్యపర్చిన ప్రధాని.. తాజాగా కజిరంగ నేషనల్ పార్క్‌లో ఏనుగుపై సవారీ చేసి అందరినీ మరోసారి సర్‌ప్రైజ్ చేశారు. అసోం పర్యటనలో ఉన్నప్రధాని ఈ ఉదయం కజిరంగ నేషనల్ పార్క్, టైగర్ రిజర్వ్‌ను సందర్శించారు. అక్కడే ఏనుగుపై ఎక్కి సవారీ కూడా చేశారు..ఆపై ప్రకృతి అందాలను తన కెమెరాలో బంధించారు..1957లో కజిరంగ జాతీయ పార్కుకు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రాంతంగా గుర్తింపు లభించిన ..మిగతా 2లో

## అరుణాచల్ సరిహద్దులో భారీ టన్నెల్

### ప్రారంభించిన మోదీ



2

## ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

హైదరాబాద్, మార్చి 9 (ప్రభాత ఉదయం): ఆర్టీసీ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. జూన్ 1 నుంచి కొత్త ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. తాజాగా సవరించిన వేతనాన్ని జూన్ 1వ తేదీ నుంచి ఉద్యోగుల అకౌంట్లలో జమ చేస్తామని తెలిపారు. కొత్త ఫిట్‌మెంట్‌తో ఆర్టీసీపై నెలకు 35 కోట్ల భారం ..మిగతా 2లో



### మహిళా సంఘాలకు

## వడ్డీలేని రుణం

### రైతుబంధుపై డిప్యూటీ సీఎం భట్టి కీలక ప్రకటన



హైదరాబాద్, మార్చి 9 (ప్రభాత ఉదయం): తెలంగాణ ప్రభుత్వం మహిళలకు మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తుండగా.. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించేలా మరో పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 12న మహిళలకు వడ్డీ లేని రుణాలు 'ఇందిరా క్రాంతి పథకం' ప్రారంభిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు పెట్టుకోవడానికి వారికి అవకాశం కల్పిస్తామని చెప్పారు. స్వయం సహాయక బృందాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని.. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రతీ మహిళను మహాలక్ష్మిలానే భావించి గౌరవిస్తున్నామని అన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతుబంధుపై భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధును ఐదు నెలల పాటు ఇచ్చిందని.. తాము వారి కంటే తక్కువ టైంలోనే అందజేస్తున్నట్లు తెలిపారు. కొండలు, గుట్టలు, రోడ్లకు రైతు బంధు ఇవ్వకూడదని నిర్ణయించినట్లు చెప్పారు. పాత డేటా ప్రకారమే రైతు బంధు ఇస్తున్నామన్న ఆయన.. ప్రస్తుతం 4 ఎకరాల లోపు ఉన్న వారికి రైతు బంధు ఇస్తున్నామని.. త్వరలో 5 ఎకరాల లోపు ఉన్న వారికి రైతు బంధు ఇస్తామని పేర్కొన్నారు. వ్యవసాయం చేసే వారికే పథకం వర్తింపచేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ..మిగతా 2లో



### 11న తెలంగాణ

## కేబినెట్ భేటీ

### మేనిఫెస్టోలోని కీలక పథకాలకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, మార్చి 9 (ప్రభాత ఉదయం): మార్చి 11న తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. సచివాలయంలో సీఎం రేవంత్రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ కేబినెట్ భేటీకి మంత్రులు, ఉన్నాతాధికారులు హాజరు కానున్నారు. ఈ కేబినెట్ భేటీలో పలు కీలకమైన అంశాలపై చర్చించనున్నారు. మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సీఎం రేవంత్ శ్రీకారం చుట్టనున్నారు. తొలుత ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ వర్తింపజేసేలా విధివిధానాలను ఖరారు చేయాలని అధికారులను సీఎం ఇప్పటికే ఆదేశించారు. సొంత జాగా ఉన్నవారికి అదే స్థలంలో ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేస్తామని ఎన్నికల టైమ్ లోనే కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్ను లాంఛనంగా భద్రాచలంలో ప్రారంభించనున్న నేపథ్యంలో హడ్కో నుంచి రూ. 3,000 మేర రుణాలు సమకూర్చుకోడానికి హౌజింగ్ బోర్డుకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతి ఇచ్చింది. ఈ విషయాన్ని మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదం తెలపనున్నది. దీనికి తోడు ..మిగతా 2లో

### ఎన్డీఏలోకి టీడీపీ, జనసేనలకు

## స్వాగతం

### బీజేపీ చీఫ్ జేపీ నడ్డా



న్యూఢిల్లీ, మార్చి 9 (ప్రభాత ఉదయం): టీడీపీ, జనసేనలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఎన్డీఏ కూటమిలోకి స్వాగతం పలికారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ తీసుకున్న నిర్ణయాన్ని తాను స్వాగతిస్తున్నానని చెప్పారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్)లో శనివారం సాయంత్రం పోస్ట్ పెట్టారు. టీడీపీ, జనసేనలు ఎన్డీఏలోకి చేరుతున్నట్టు బీజేపీ అధికారికంగా ప్రకటించింది. ఏపీలో రాబోయే లోక్ సభ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తున్నట్టు ఆ పార్టీ వెల్లడించింది. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శనివారం సాయంత్రం తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) హ్యాండిల్ లో ఎన్డీఏలోకి రెండు పార్టీలకు స్వాగతం పలికారు. 'చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్డీయేలో చేరడాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాను. ప్రధాని నరేంద్ర మోడీ డైనమిక్, దార్శనిక నాయకత్వంలో బీజేపీ, టీడీపీ, జనసేనలు దేశ పురోగతికి, రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ ప్రజల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాయి" అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు. కాగా.. శనివారం ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. వీరి మధ్య కొన్ని గంటల పాటు చర్చలు జరిగాయి. అనంతరం పొత్తుపై ఏకాభిప్రాయానికి వచ్చారు. కాగా.. ఏపీలో అసెంబ్లీ, లోక్ సభ ..మిగతా 2లో

## హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటే

# నగర బహిష్కరణే

మొదటి పేజీ తరువాయి...

మూసీ కాలుష్యం నల్గొండ జిల్లాలోని 50 వేల ఎకరాలను కలుషితం చేస్తోంది. మూసీ అభివృద్ధికి టెండర్లు పిలిచాం. రూ.50 వేల కోట్లతో మూసీని ఆధునీకరిస్తాం. మాస్టర్ ప్లాన్ అందగానే ప్రజాభిప్రాయ సేకరణ చేస్తాం. వైబ్రంట్ తెలంగాణ 2050కి ప్రణాళికలు తయారు చేస్తున్నాం. కాంగ్రెస్ హయాంలోనే ఔటర్ రింగ్ రోడ్డు, విమానాశ్రయం వచ్చాయి. వాటితో ఎన్నో కంపెనీలు రావడంతో తెలంగాణకు మంచి గుర్తింపు వచ్చింది. ఓఆర్ఆర్ లోపల ఉన్న అన్ని మున్సిపాలిటీలను హెచ్ఎండీఏ పరిధిలోకి తెస్తాం. భవిష్యత్తులో నిర్మించే రీజనల్ రింగ్ రోడ్డుతో (ఆర్ఆర్ఆర్) తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుంది. రాబోయే వందేళ్లు గొప్ప నగరంగా ఉండేలా భాగ్య నగరాన్ని తీర్చిదిద్దుతాం.' అని రేవంత్ స్పష్టం చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 'కొడంగల్ లో చేదు అనుభవం ఎదురైనా మల్కాజిగిరిలో ఎంపీగా పోటీ చేశాను. ఎల్బీనగర్ నియోజకవర్గం నాకు 30 వేల మెజార్టీ ఇచ్చి ప్రజా గొంతుకను ఇచ్చింది. ఇక్కడకు ఎప్పుడు వచ్చినా నా గుండె వేగం పెరుగుతుంది. మెట్రో రైలును విస్తరిస్తూ ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకూ తీసుకెళ్తాం. ఎల్బీ నగర్ నుంచి శంషాబాద్ వరకూ మెట్రో రాబోతోంది. ఉప్పల్, నాగోల్, ఎల్బీ నగర్, హయత్ నగర్, ఓవైసీ హాస్పిటల్, చాంద్రాయణగుట్ట, మైలార్ దేవర్ పల్లి మీదుగా మెట్రో రైలు నిర్మించాల్సిన బాధ్యత మాపై ఉంది. హైదరాబాద్ లో మెట్రో విస్తరణ అడ్డుకోవాలని చూసేవారిని ఈ వేదికగా హెచ్చరిస్తున్నా. హైదరాబాద్ నగర అభివృద్ధికి మీరు అడ్డుపడొద్దు. అభివృద్ధి పనులను అడ్డుకోవాలని చూస్తున్న వారికి నగర బహిష్కరణ తప్పదు.' అంటూ వ్యాఖ్యానించారు.





ఉమ్మడి మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నవీన్ రెడ్డికి బీఫామ్ అందజేస్తున్న బిఆర్ఎస్ అధినేత కెసిఆర్

## నవీన్ కుమార్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి: బి ఆర్ ఎస్ అధినేత కెసిఆర్

మహబూబ్ నగర్, మార్చి9(ప్రభాత ఉదయం) మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు శాసనసభ్యులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కలిసి పని చేయాలని బి ఆర్ ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సూచించారు. శనివారం బి ఆర్ ఎస్ నవీన్ కుమార్ రెడ్డికి బీ-ఫామ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ విజయం సాధించాలని ఆకాంక్షించారు. నవీన్ కుమార్ రెడ్డికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ , వనపర్తి మాజీ ఎమ్మెల్యే శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు..



ఎమ్మెల్యే జిఎంఆర్ కుటుంబ సభ్యులను సన్మానించిన మన్యంకొండ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు

## మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులు

మహబూబ్ నగర్, మార్చి9(ప్రభాత ఉదయం) పేదల దేవుడిగా కొలిచే మన్యంకొండ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని దేవరకద్ర నియోజకవర్గంలో శాసనసభ్యులు జిఎంఆర్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... పేదల దేవుడిగా కొలిచే మన్నెంకొండ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

## ఎన్నికల కమిషనర్ రాజీనామా

న్యూఢిల్లీ, మార్చి 9 (ప్రభాత ఉదయం): లోక్ సభ ఎన్నికలకు ఇంకా మరికొన్ని రోజులే ఉన్న తరుణంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేంద్ర ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను వెంటనే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. అయితే ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘంలో ఒక ఖాళీ ఉండగా.. ఈ రాజీనామాతో మరో ఖాళీ ఏర్పడింది. కేంద్ర ఎన్నికల కమిషన్ లో ఇప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మాత్రమే మిగిలి ఉన్నారు. వచ్చే వారం లోక్ సభ ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో అరుణ్ గోయల్ రాజీనామా చేయడం ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. వాస్తవానికి ఎన్నికల కమిషనర్ గా ఆయన పదవి కాలం మరో మూడేళ్లు ఉంది. కానీ ఈలోపే ఈ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. 1985 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన గోయల్ 2022 నవంబర్ 18న స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అయితే మరుసటి రోజే ఎన్నికల కమిషనర్ గా నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం హడావిడిగా ఆయనను నియమించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. ఈ పిటిషన్ ను ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం గతేడాది కొట్టివేసింది. రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశాన్ని పరిశీలించిందని, అయితే గోయల్ నియామకాన్ని రద్దు చేయడానికి నిరాకరించిందని పేర్కొంది. కాగా.. ఫిబ్రవరిలో మరో ఎన్నికల కమిషనర్ అనూప్ పాండే పదవీ విరమణ పొందారు. ఇప్పుడు గోయల్ కూడా రాజీనామా చేయడంతో త్రిసభ్య ఈసీ ప్యానెల్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ మాత్రమే ఉన్నారు. అయితే గోయల్ రాజీనామాకు కారణం ఏంటో తెలియరాలేదు.

## ఎన్డీఏలోకి టీడీపీ, జనసేనలకు స్వాగతం

మొదటి పేజీ తరువాయి...

ఎన్నికలు ఏకకాలంలో జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సీట్ల సర్దుబాటు జరిగింది. అయితే 175 అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ అధికంగా సీట్లు తీసుకోబోతోంది. జనసేన-బీజేపీకి 30 అసెంబ్లీ స్థానాలు కేటాయించారు. ఇందులో జనసేనకు 24 సీట్లు ఇది వరకే ఉండగా.. బీజేపీకి 6 సీట్లు వచ్చాయి. అలాగే బీజేపీకి 6 లోక్ సభ స్థానాలు, జనసేనకు 2 లోక్ సభ స్థానాలు కేటాయించారు. అయితే టీడీపీ, బీజేపీలు బంధం కొత్తగా ఏర్పడిందేమీ కాదు.. ఈ రెండు పార్టీల మధ్య చాలా కాలం నుంచి అనుబంధం ఉంది. 1996లో టీడీపీ మొదటి సారిగా ఎన్డీయేలో చేరింది. మళ్లీ పలు కారణాల వల్ల విడిపోయింది. 2014లో లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేశాయి. అటు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చాయి. టీడీపీకి కేంద్ర మంత్రి వర్గంలో కూడా చోటు దక్కింది. కానీ 2018లో ఎన్డీఏ నుంచి టీడీపీ బయటకు వచ్చింది. 2019లో వచ్చిన లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ చతికిలపడిపోయింది. వైఎస్ జగన్ ఆధ్వర్యంలని వైసీపీ ఇటు రాష్ట్రంలో ఘన విజయం సాధించడంతో పాటు రాష్ట్రంలో అత్యధిక లోక్ సభ సీట్లను కైవసం చేసుకుంది. అయితే ఈ ఎన్నికల్లో అధికారం చేపట్టాలని భావిస్తున్న టీడీపీ తన మిత్రపక్షంగా ఉన్న జనసేనను, గతంలో కలిసి నడిచిన బీజేపీని కలుపుకొని పోవాలని భావిస్తోంది. అందుకే ఆ రెండు పార్టీలతో కలిసి పోటీ చేస్తోంది.



## నరేంద్రుడు.. గజేంద్రుడు

మొదటి పేజీ తరువాయి...

తర్వాత దేశ ప్రధాని ఇక్కడ పర్యటించడం ఇదే మొదటిసారి.. తొలిసారిగా కజిరంగ పార్కుకు వచ్చిన ప్రధాని మోదీ. తొలుత ఏనుగుపై సవారీ చేశారు.. అనంతరం ప్రధాని ఓపెన్ టాప్ జీప్‌పై పార్కులో తిరుగుతూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించారు. బైనాక్యూలర్‌తో పార్క్ అందాలను వీక్షించారు. అలా పార్క్‌లో రెండు గంటలు గడిపారు.. ఆపై పార్క్‌లోని సిబ్బందితో కాసేపు మాట్లాడి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు.. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు ముందు ప్రధానమంత్రి నరంద్ర మోదీ.. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పర్యటిస్తూ.. అనేక అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తూ బిజీగా ఉన్నారు. ఇంత బిజీ షెడ్యూల్ ల్లోనూ మోదీ.. తన స్టైల్లో సరదాగా కాసేపు ప్రకృతిని ఆస్వాదిస్తూ ఎంజాయ్ చేశారు..

## ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

మొదటి పేజీ తరువాయి...

పడనుందని వివరించారు. కొత్త ఫిట్‌మెంట్ ద్వారా 53వేల 71 మంది ఆర్టీసీ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని స్పష్టం చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్. కార్మికులకు బోనస్, ఇతర బెనిఫిట్స్ ఇచ్చే విధంగా ముందుకెళ్తున్నామన్నారు. 21శాతం ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని.. దాంతో ప్రతి ఏటా రూ.418.11కోట్ల భారం పడుతుందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో సర్వీసులో ఉన్న 42,057 మంది ఎంప్లాయిస్‌కు, 2017 నుంచి రిటైర్డ్ అయిన 11,014 మంది ఉద్యోగులు మ్మొత్తంగా 53,071 మందికి ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం వెల్లడించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48గంటల్లో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని.. దాన్ని అమలు చేయడంలో ఆర్టీసీ బాధ్యతను నెరవేరుస్తుందని చెప్పారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఈసందర్భంగా ఆర్టీసీ సిబ్బందికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

## 12న తెలంగాణ కేబినెట్ భేటీ

మొదటి పేజీ తరువాయి...

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీల్లోని మహాలక్ష్మిలోని నెలకు రూ. 2,500 చొప్పున మహిళలకు ఆర్థిక సాయం అందించడంపైనే కేబినెట్ చర్చించి ఆమోదం పొందనున్నది. వీటికి తోడు విధానపరమైన మరికొన్ని అంశాలు కూడా ఈ సమావేశంలో చర్చకు రానున్నాయి. త్వరలో లోక్సభ ఎన్నికల కోడ్ రానుండడంతో ఈ లోపే ఆరు గ్యారంటీల్లో పెండింగ్లో ఉన్నవాటికి మంత్రివర్గం ఆమోదం పొందడంతో పాటు ఆన్-గోయింగ్ స్కీములుగా ఉంచేందుకు ప్రారంభోత్సవాలు చేయాలని అనుకుంటున్నారు. సచివాలయంలో టాటా టెక్నాలజీస్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలలో అధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రాల (స్కిల్లింగ్ సెంటర్లు) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో టాటా గ్రూప్ కంపెనీ ఒప్పందం చేసుకుంది. సంబంధిత ఎంవోయూ పత్రాలపై అధికారులు సంతకాలు చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేయనుంది టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ . ప్రభుత్వ భాగస్వామ్యంతో ఈ కొత్త ప్రాజెక్టును చేపడుతున్న టాటా టెక్నాలజీస్ .. 9 లాంగ్ టర్మ్, 23 షార్ట్ టర్మ్ కోర్సులతో పాటు నైపుణ్యాల మధ్య అంతరాన్ని తగ్గించే బ్రిడ్జి కోర్సులను నిర్వహిస్తుంది. ఈ 2024-25 విద్యాసంవత్సరం నుంచే ప్రాజెక్టు అమలుకు సన్నాహాలు చేస్తోంది ప్రభుత్వం.

## మహిళా సంఘాలకు వడ్డీలేని రుణం

మొదటి పేజీ తరువాయి...

వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టేది లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు ఎప్పుడూ నెల మొదటి వారంలో జీతాలు అందలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యోగులందరికీ మార్చి 1నే జీతాలు అందించామని అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలను పెంచబోమని భట్టి స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో కరెంట్ వినియోగం పెరిగినా తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో 16 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరాకు కూడా సిద్ధమన్నారు. త్వరలో విద్యుత్ పాలసీ తీసుకొస్తామని అన్నారు. సోలార్ విద్యుత్ ను కూడా ఎలా వినియోగించుకోవాలనే దానిపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. 'గృహజ్యోతి' కింద అర్హులై ప్రతి ఇంటికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని.. ఇప్పటివరకూ 40,33,702 జీరో బిల్లులు జారీ చేసినట్లు వివరించారు. అర్హులై ఉండి 200 యూనిట్ల లోపు వాటి కరెంట్ బిల్ వచ్చినా ఆందోళన చెందాల్సిన పని లేదని.. స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి వివరాలు అందిస్తే అప్ డేట్ చేస్తారని అన్నారు. బిల్ కట్టాల్సిన పని లేదని స్పష్టం చేశారు. గృహజ్యోతి కోసం దరఖాస్తు ప్రక్రియ నిరంతరం అని.. దరఖాస్తు చేసుకోని వారు అప్లై చేసుకోవాలని సూచించారు.




## అరుణాచల్ సరిహద్దులో భారీ టన్నెల్

ఈటానగర్, మార్చి 9 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా విస్తృత పర్యటనలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే భారీగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈశాన్య రాష్ట్రాల్లో మొత్తం రూ.55,600 వేల కోట్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఇక అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఈటానగర్ నుంచి సేలా టన్నెల్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిని గత కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని.. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత ఈశాన్య రాష్ట్రాల్లో మోదీ గ్యారంటీ ఫలితాలు కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే నార్త్ ఈస్ట్‌లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని నమ్మకం ఉందని తెలిపారు. తాను ఎన్నికల కోసం పనిచేయనని.. ప్రజల కోసమే పనిచేస్తానని తేల్చి చెప్పారు. భారత్-చైనా సరిహద్దుల్లోని తూర్పు సెక్టార్‌లో నిర్మించిన సేలా టన్నెల్‌ను శనివారం ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. ఈటానగర్‌లో నిర్వహించిన 'వికసిత్ భారత్- వికసిత్ నార్త్ ఈస్ట్' కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని ఈ టన్నెల్‌ను ప్రారంభించారు. ప్రపంచంలోనే పొడవైన రెండు వరుసల టన్నెల్‌గా ఈ సేలా టన్నెల్ రికార్డుల్లో నిలిచింది. అంతే కాకుండా చైనా సరిహద్దుల్లోకి సైన్యాన్ని మెరుపు వేగంతో తరలించేందుకు ఈ సేలా టన్నెల్ ఉపయోగపడనుంది. ఈ టన్నెల్ అందుబాటులోకి రావడంతో తవాంగ్-దిరాంగ్ ప్రాంతాల మధ్య 12 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. దీంతో 90 నిమిషాల ప్రయాణ సమయం ఆదా అవుతుందని అధికారులు వెల్లడించారు. ఈ సేలా టన్నెల్‌ను సముద్ర మట్టానికి 13 వేల అడుగుల ఎత్తులో పర్వత కొండల మధ్య నిర్మించారు. ఈశాన్య రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితుల కారణంగా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లడానికి చాలా ఇబ్బంది ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లో అయినా బాలిపారా-చారిదౌర్-తవాంగ్ రహదారిలో ప్రయాణం ఆగిపోకుండా ఉండేందుకు ఈ సేలా టన్నెల్‌ను నిర్మించారు. ఈ 2 లేన్ల సేలా టన్నెల్‌ను బోర్డర్స్ రోడ్స్ ఆర్గనైజేషన్-బీఆర్ఓ నిర్మించింది. ఈ ప్రాజెక్టులో 2 సొరంగాలు ఉన్నాయి. టన్నెల్-1 సింగిల్ ట్యూబ్‌తో 1003 మీటర్ల పొడవు ఉంటుంది. ఇక టన్నెల్-2 రెండు సొరంగమార్గాలతో 1595 మీటర్ల పొడవు కలిగి ఉంది. ఈ రెండింటిని కలిపే రోడ్డు పొడవు 1200 మీటర్లు కాగా.. టన్నెల్-2 సొరంగమార్గాల్లో ఒకటి సాధారణ ట్రాఫిక్‌కు, మరొకటి ఎమర్జెన్సీ సర్వీసుల కోసం నిర్మించారు. పర్వతాల మధ్య సేలా అండర్‌పాస్‌కు 400 మీటర్ల దిగువన ఈ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ టన్నెల్ వల్ల చలికాలంలో కూడా రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఉండదని అధికారులు వెల్లడించారు. అంతే కాకుండా భారత్-చైనా సరిహద్దులో ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా సైన్యాన్ని, ఆయుధాలను, ఇతర సామాగ్రిని వేగంగా తరలించేందుకు ఉపయోగపడుతుందని తెలిపింది. ఈ సేలా టన్నెల్ సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సామాజికంగా, ఆర్థికంగా ఎంతో ప్రయోజనం చేకూర్చుతుందని వెల్లడించింది. ఇక ఈ టన్నెల్ అన్ని రకాల సెక్యూరిటీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. టన్నెల్‌కు వెంటిలేషన్, లైటింగ్, ఫైర్ సేఫ్టీ సహా అత్యంత అధునాతన సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ సేలా టన్నెల్ ప్రాజెక్టుకు 2019 ఫిబ్రవరి 9 వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. ఈ టన్నెల్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.825 కోట్లు ఖర్చు చేసింది. చైనా సరిహద్దుల్లోని అరుణాచల్‌ప్రదేశ్ తవాంగ్ సెక్టార్‌లో ఈ సేలా టన్నెల్‌ను నిర్మించారు. ఈ సొరంగ మార్గంతో ఇండియన్ ఆర్మీ.. ఏదైనా విపత్కర పరిస్థితుల్లో భారత వేగంగా సరిహద్దులకు చేరుకునే అవకాశం ఉంటుంది. సాధారణంగా చైనా సరిహద్దులు భారత సరిహద్దులతో పోల్చితే ఎత్తులో ఉండటంతో.. మన దేశ సైనికులు, సైనిక వాహనాలు ఎక్కడికి వెళ్తున్నాయి.. ఏం చేస్తున్నాయి అనే విషయాలను చైనా సైన్యం సులభంగా గుర్తిస్తుంది. ఇక ఈ సేలా టన్నెల్ అందుబాటులోకి వస్తే.. శత్రు సైన్యానికి చిక్కకుండా భారత బలగాలు సరిహద్దులను చేరుకుంటాయి.

## నారీమణులకు నీరాజనం

### నిన్నటి తరం మహిళా ప్రతిభా మూర్తులపై స్పందన కలిగించిన ప్రసంగాలు

హైదరాబాద్, మార్చి 9(ప్రభాత ఉదయం) ఎన్నో కష్టనష్టాల మధ్య సామాజిక అవరోధాలను ఎదుర్కొంటూ ముందుకు సాగి చరిత్రలో ప్రముఖంగా నిలిచిపోయిన మహిళలు ఎందరో ఉన్నారని వక్తలు అన్నారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి స్థాపించిన సుశీలా నారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నగరంలోని సినారే నిలయం 'విశ్వంభర'లో ఏర్పాటు చేసిన సదస్సులో పలువురు ప్రముఖ మహిళలు పాల్గొని నిన్నటి తరం ప్రతిభా మూర్తులైన నారీమణులకు నీరాజనం పలికారు. ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా కర్ణాటక సంగీత విద్వాంసురాలు, నర్తకి బెంగుళూరు నాగరత్నమ్మ, హిందుస్థానీ సంగీత విద్వాంసురాలు నైనా దేవి ల గురించి ప్రసంగించారు. నాగరత్నమ్మ దేవదాసి వర్గంలో జన్మించినప్పటికీ పట్టుదలతో సంగీత నృత్యాల్లో ప్రావీణ్యం, సంస్కృతం, తెలుగు, కన్నడ, తమిళం వంటి భాషల్లో పాండిత్యం సంపాదించి గొప్ప విదుషీమణిగా పేరుపొంది ధర్మకార్యాలు చేసిందని, అయినప్పటికీ ఎన్నో ఈసడింపులకు గురైందని తెలిపారు. ఉత్తరాదికి చెందిన నైనాదేవి కూడా ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని గొప్ప విద్వాంసురాలిగా హిందుస్తానీ సంగీత రంగానికి విశేషమైన సేవలు చేసిందని తెలిపారు. ప్రముఖ నర్తకి, నాట్య గురువు డాక్టర్ యశోదా ఠాకూర్ దేవదాసీ నాట్య శైలిని గురించి ప్రసంగించి ఆకట్టుకున్నారు. ఆలయ ఆస్థాన నృత్య కళను సుసంపన్నం చేసిన దేవదాసీలను సమాజం, ప్రభుత్వం అనేక కష్టాలకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నాబత్తుల బులి వెంకటరత్నం అనే నృత్యకారిణి గురించి అనేక విశేషాలు తెలియజేస్తూ బులి వెంకటరత్నం నృత్య కల్పన చేసి ప్రదర్శించిన జావళిని అభినయపూర్వకంగా యశోద ప్రదర్శించి కరతాళ ధ్వనులందుకున్నారు. భూమిక సంపాదకురాలు, రచయిత్రి కొండవీటి సత్యవతి కొండపల్లి కోటేశ్వరమ్మ గురించి ప్రసంగిస్తూ పీపుల్స్ వార్ నాయకుడు కొండపల్లి సీతారామయ్య భార్యగానే కాకుండా గొప్ప ఉద్యమకారిణిగా, రచయిత్రిగా అన్నింటికీ మించి ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ కడవరకూ జీవితంతో పోరు సాగించిన వ్యక్తిగా కోటేశ్వరమ్మ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ఆమె రచించిన నిర్జన వారధి పుస్తకం చదివితే భర్త అయిన కొండపల్లి సీతారామయ్య చీకటి కోణాలను తెలుసుకోవచ్చు అన్నారు. ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రా దేవి శివరాజు సుబ్బలక్ష్మి గురించి మాట్లాడుతూ... ప్రముఖ నవలా రచయిత బుచ్చిబాబు సతీమణి అయిన శివరాజు సుబ్బలక్ష్మి భర్తకు దీటుగా కథలు,చిత్రలేఖనాలు సృష్టించారని, కొన్ని సందర్భాల్లో బుచ్చిబాబు నవల కన్నా మీ కథలు బాగుంటాయి అనే ప్రశంసలు పొందారని వివరించారు. సామాజికంగా ఎటువంటి ప్రోత్సాహం లేని ఆ కాలంలో ఇలాంటి మహిళలు ఉన్నత శిఖరాలకు ఎదిగి నేటి తరానికి ఆదర్శప్రాయులయ్యారని అన్నారు. శ్రీమతి సుశీలా నారాయణ రెడ్డి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య స్వాగతం పలుకుతూ భారతీయ సమాజానికి వివిధ రంగాల్లో స్వయంకృషితో సేవలందించిన ప్రముఖ మహిళల గురించి ఈ తరానికి తెలియ చేసేందుకే నారీమణులకు నీరాజనం నిర్వహిస్తున్నామన్నారు.ట్రస్ట్ అధ్యక్షురాలు సి. గంగ, సినారె కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో ప్రముఖ రచయిత్రులు, రచయితలు, కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మహిళా నాయకురాల్లు









చిన్న అనంతగిరి శివాలయంలో పుష్పాలంకరణ



పుష్పాలంకరణ



శుక్రవారం అర్ధ రాత్రి 12 గంటలు దాటిన తర్వాత జరిగిన శివ పార్వతుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



శివ పార్వతుల ఊరేగింపు



బుద్వేల్ ఈదమ్మ దేవాలయం ఆవరణ లో శివరాత్రి జాగరణలో పాల్గొన్న భక్తులు

# బీజేఆర్ యూత్ ఆధ్వర్యంలో బుద్వేల్‌లో మహా శివరాత్రి జాగరణ కార్యక్రమం

బుద్వేల్, మార్చి9(ప్రభాత ఉదయం) : హిందువులు ఎంతో భక్తి శ్రద్ధలతో శివనామ స్మరణలతో ఉపవాస దీక్షలను చేపట్టి సాయంత్రం దేవాలయ చేరుకొని ఉపవాస దీక్షలను విరవింప చేసే పండుగ మహాశివరాత్రి. సాయంత్రం జాగరణ కార్యక్రమాలను ఆయా దేవాలయాల వద్ద ఎంతో ఘనంగా నిర్వహిస్తూ ఉంటారు. ఈ కోవలోనే సర్కిల్ పరిధిలోని బుద్వేల్ బస్తీలో అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం యువత మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జాగరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జాగరణలో ఆర్కెస్ట్రా ఏర్పాటుచేసి భక్తి గీతాలను ఆలపిస్తూ ప్రతి ఒక్కరిని అలరింప చేశారు. బీజేఆర్ యువత ఉపవాస దీక్షలో ఉన్న ప్రతి ఒక్కరికి పండ్లు, అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం ఇలాగే ప్రతి పండుగలను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని చెప్పారు.



కోలాటం ఆడుతున్న మహిళలు







శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న అశేష భక్తులు.. స్వామివారి సేవలో పాల్గొన్న ప్రణభక్త సమాజం ప్రతినిధులు.. చిన్న అనంతగిరి శివాలయంలో పుష్పాల ముగ్గులతో అలంకరించిన పరమేశ్వరుడు

# అత్తాపూర్ చిన్న అనంతగిరి శివాలయంలో భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు

### ఘనంగా శివపార్వతుల కళ్యాణం
### వేలాదిగా తరలివచ్చిన భక్తులు

రాజేంద్రనగర్, మార్చి 9(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ లోని చిన్న అనంతగిరి శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవ సందర్భంగా రాత్రి శివ పార్వతి కళ్యాణం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రీశైలం లో నిర్వహించే విధంగా ఇక్కడ రాత్రి 12 గంటల తర్వాత వేద పండితుల ద్వారా కళ్యాణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హైదర్గూడ ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులందరూ కలిసి ప్రతి ఏడాది శివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తారు. చారిత్రాత్మక అనంతగిరి శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఈ మహాశివరాత్రి ఉత్సవాలలో అత్తాపూర్, పాండురంగ నగర్, పరిసర ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రణవభక్త సమాజం అధ్యక్షులు ఎం నరసింహ, ఉపాధ్యక్షులు ఎస్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, సంయుక్త కార్యదర్శి బి మల్లారెడ్డి, కోశాధికారి ఎస్ బి హరినాథ్, సలహాదారులు కోలన్ సుభాష్ రెడ్డి, మ్యాడమ్ రామేశ్వరరావు,నారాగూడెం మల్లారెడ్డి, ఎం కొమురయ్య, జయానంద రెడ్డి, కాడెం సుధాకర్, సురేష్ ,విజయ్, కిట్టు, కిరణ్ , ఎం బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న మహ్మద్ అహ్మద్



ప్లాస్టిక్ టబ్‌లలో అల్లం వెల్లుల్లి పేస్ట్



అల్లం వెల్లుల్లి పేస్ట్‌లో సింథటిక్ కెమికల్స్

# అపరిశుభ్రమైన వాతావరణంలో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న స్థావరంపై ఎస్వోటీ పోలీసుల దాడులు

బుద్వేల్, మార్చి9(ప్రభాత ఉదయం) : సింథటిక్ కెమికల్స్ వేసి అపరిశుభ్రమైన వాతావరణంలో కాటేదాన్ సుభాన్ కాలనీలో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్టును అనుమతులు లేకుండా తయారు చేస్తున్న చార్మినార్ రంగేళి కిడికి చెందిన మహమ్మద్ అహ్మద్ (34) ను రాజేంద్రనగర్ ఎస్ ఓ టీ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. యూనిట్ లో రూ. 2.8 లక్షలు విలువ చేసే యంత్రాలు, నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ , ముడి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేయడానికి మహమ్మద్ అహ్మద్ తీసుకున్న ఎఫ్ఎఫ్ ఎస్ ఏ ఐ లైసెన్సు రెండేళ్ల క్రితం ముగిసినట్లు పోలీసులు కనుగొన్నారు.

**అపరిశుభ్రమైన వాతావరణంలో.....**

అపరిశుభ్రమైన వాతావరణం లో సింథటిక్ కెమికల్స్ వేసి తయారుచేసిన 3,500 కిలోల నకిలీ అల్లమ్ వెల్లుల్లి పేస్ట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అల్లం వెల్లుల్లి పేస్ట్ లో సింథటిక్ ఫుడ్ కలర్, సోడియం బెంజోయేట్, మృదుత్వం కోసం కెమికల్ పౌడర్ , చెడిపోయిన వెల్లుల్లి తొక్కలను వేస్తూ తయారు చేస్తున్నట్లు ఎస్వోటీ పోలీసులు కనుగొన్నారు. దాడులలో 25 కిలోల చొప్పున వదులుగా 44 టబ్బుల లో ఉన్న ఒక టన్ను కల్తీ అల్లమ్ వెల్లుల్లి పేస్ట్ , రెండు టన్నుల ప్యాక్ చేసిన వెల్లుల్లి పేస్ట్ , సంచుల్లో ఉన్న 500 కిలోల ముడి వెల్లుల్లి మెటీరియల్, రెండు మిషన్లు, వదులుగా ఉండే సోడియం బెంజోయేట్ రసాయనపొడి, రెండు గ్రాండర్ లు, రంగు కోసం పసుపు పొడి, స్టిక్కర్లు ప్యాకింగ్ పెట్టెలను స్వాధీనం చేసుకున్నాను. రోషన్ అల్లం వెల్లుల్లి పేస్ట్, మాస్ డైమండ్, స్వచ్ఛమైన అల్లం పేర్ల తో అల్లం వెల్లుల్లి పేస్టును విక్రయిస్తున్నట్లు ఎస్వోటీ పోలీసులు కనుగొన్నారు. తదుపరి విచారణ నిమిత్తం మహమ్మద్ అహ్మద్ తో పాటు సామాగ్రిని మైలార్ దేవ్ పల్లి పోలీసులకు అప్పగించారు.



శ్రీనివాస్ రెడ్డికి కేకు తినిపించి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

# ఘనంగా కాంగ్రెస్ వనపర్తి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

### శ్రీనివాస రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు ఎమ్మెల్యే జిఎంఆర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొత్తకోట,మార్చి9(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కొత్తకోట వేముల శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి జన్మదిన సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్, జిల్లా, కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి కేకు కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు . శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పి ప్రశాంత్, సాక బాల నారాయణ, పి కృష్ణారెడ్డి,మదనాపురం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగన్న, గోపి స్వామి, మేస్త్రి శ్రీను, వై నరేందర్ రెడ్డి, జెసిబి రాముడు, సలీం ఖాన్, పి మోహన్ రెడ్డి, వడ్డే కృష్ణ, తయ్యుబ్, రాములు యాదవ్, సంద వెంకటేష్, సాకలి వెంకటేష్ లు ఉన్నారు . ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ... వేముల శ్రీనివాస్ రెడ్డి ప్రజల , పార్టీ కోసం రేయి పగలు కష్టపడి చేస్తున్నారన్నారు. పంటలు పండించే అన్నం పెట్టే రైతన్నల సమస్యల పైన నిరంతరం పోరాడుతున్న శ్రీనివాస్ రెడ్డి నిండూ నూరేళ్లు, సుఖశాంతులతో అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో,జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.




వేముల శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్


# పెద్ద గోల్కొండ భగీరథ శివాలయంలో పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం

### భక్తులకు అన్నదాన వితరణ చేసిన మాజీ సర్పంచ్ దంపతులు. సునీత, లక్ష్మయ్య

శంషాబాద్, మార్చి 9, ( ప్రభాత ఉదయం) మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పెద్ద గోల్కొండ గ్రామంలోని శ్రీ శ్రీ భగీరథ శివాలయంలో పార్వతీ పరమేశ్వరుల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచులు కాముని బాయి సునీత. కాముని భాయి లక్ష్మయ్య ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండి ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు శుక్రవారం రాత్రి స్వామివారి అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జాతర ఏర్పాటు చేశారు. గణపతి పూజ, అభిషేకం, లక్ష్మి పూజ, నవగ్రహ పూజ, ఆంజనేయస్వామి పూజ అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. కళ్యాణం అనంతరం తెలంగాణ ధూంధాం కార్యక్రమం రాత్రి 10 గంటలకు భజన మండలి ఆధ్వర్యంలో భజనలు చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన వేద పండితులు ఎస్ ప్రవీణ్ శర్మ వడ్ల ఆచారి రామకింకర్ శుక్ల నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచులు కామునిభాయి సునీత, కామునివాయి లక్ష్మయ్య, దేవాలయ వైస్ చైర్మన్ ఆనగోని భాస్కర్ గౌడ్, దేవాదయ సలహాదారుడు బండారి సహదేవ్, కే. అర్జున్ రెడ్డి, వెంకటేష్, రాఘవేందర్, సంతోష్, టెంపుల్ మాజీ మెయింటెనేజర్ ఆర్ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు ప్రసాదం చేస్తున్న లక్ష్మయ్య



శివపార్వతుల కళ్యాణంలో గ్రామస్తులు

# మండుతున్న గుండెలు... ఎండుతున్న పంటలు

### నీరందక నెర్రెలు వారుతున్న పొలాలు
### బోరుబావులపై ఆధారపడి వరి సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరం


నీళ్లు లేక ఎండిన పంటను మేపుతున్న గొర్రెలు కాపరులు


నీరు లేక నరేల వారి ఎండిన వరి పంట

గద్వాల,మార్చి9(ప్రభాత ఉదయం)గత ప్రభుత్వ హయాంలో రైతులకుపంట పెట్టుబడి సాయానికి రైతుబంధు సాయం, 24 గంటల నిరంతర విద్యుత్, పుష్కలంగా సాగు నీరు ఉండటంతో గతేడాది మాదిరిగానే ఈ యాసంగిలో కూడ ఏ రందీ లేకుండా సాగు చేసుకోవచ్చని అన్నదాతలు భావించారు. గత యేడాది పచ్చని పంటలతో అలరారిన జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రస్తుతం ఎటుచూసినా ఎండిన పంటలు, అడుగంటిన చెరువులు, కుంటలు, బావులు కనిపిస్తున్నాయి. యాసంగిలో ఎన్నో ఆశలతో వరి సాగు చేసిన రైతులు అరిగోస పడుతున్నారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతోంది. అధిక ఉష్ణోగ్రతలకు పొలాలు బీటలు వారుతున్నాయి. వేసవి ఆరంభంనుంచే ఎండలు దంచికొడుతున్నాయి. క్రమేన రిజర్వాయర్ లలో నీళ్ళు లేక, ఎండలకు బోర్లు ఎండిపోతుండటంతో వరి పొట్టకొచ్చే దశలో కళ్లముందే నిలువునా ఎండిపోతుంటే రైతు విలవిల్లాడుతున్నాడు. ఆరుగాలం శ్రమంతా వృథా అవ్వడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు వరప్రదాయిని జూరాల ప్రాజెక్టు మీద ఆధారపడిన నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో బాగంగా నిర్మించిన గూడెందొడ్డి, ర్యాలంపాడు రిజర్వాయర్ ల ద్వారా గద్వాల నియోజకవర్గంలో వ్యవసాయానికి సాగు నీరందుతోంది. గత వర్షాకాలం సీజన్ లో వర్షాలు లేక ప్రాజెక్టుకు మోస్తాదు వరద నీటి రావడంతో నీటి నిల్వల సామర్థ్యాని దృష్టిలో పెట్టుకొని రిజర్వాయర్ లకు నీటిని విడుదల చేశారు. వానకాలం పంటలకు సరిపడా సాగు నీటిని కాలువల ద్వారా విడుదల చేశారు. వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు పడిపోవడంతో యాసంగి సీజన్ సాగునీరందించడం కష్టమని అధికారులు ముందే క్రాప్ హాలిడే ప్రకటించారు. దీంతో రిజర్వాయర్ ల మీద ఆదారపడిన రైతాంగం యాసంగి పంటల పై మొగ్గు చూపలేదు. ధరూర్, కేటిదొడ్డి, మల్దకల్, గద్వాల, గట్టు మండలాలో కాలువల కిందా వ్యవసాయ బోర్లు ఉన్నవారు మాత్రమే వరి వేశారు. అయితే మొదట్లో తెగుళ్లు రావడంతో పంట పొలాలను కాపాడుకునేందుకు తంటాలు పడ్డారు. అప్పుడు వేలాది రూపాయలు ఖర్చు పెట్టి, మందులు పిచికారీ చేశారు. తీరా ఇప్పుడు పంటలు పొట్ట దశకు చేరుకున్న సమయంలో సాగునీరు అందకపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. అయితే ఫిబ్రవరి మొదటివారం నుంచే ఎండలు తీవ్రరూపం దాల్చడంతో వ్యవసాయ బావుల్లో నీరు అడుగంటిపోతున్నాయి. బోర్లు నీరు ఇంకిపోతున్నది. దీంతో వరికి సరిపడా నీరందించలేక రైతులు అల్లాడుతున్నారు. పంటను దక్కించుకోవాలన్న తపనతో కొందరు వ్యవసాయ బావుల్లో పూడికతీతను చేపట్టారు. మరికొందరు అప్పు చేసి బోర్లు వేయిస్తున్నారు. అయినా చుక్కనీరు పడకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. చేసేదేమీ లేక నెర్రెలువారిన చేనులో పశువులను మేపుతున్నారు. గద్వాల నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో రైతులు తమ పంట చేలు ఎండిపోవడంతో కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందా... లేక అన్నదాతలను వదిలేస్తుందా వరి సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించకుంటే రైతులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నష్టపరిహారం అందించి రైతాంగాని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



# చెన్ను రవీందర్‌ను పరామర్శించిన ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

కూకట్‌పల్లి, మార్చి 9 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ జనసేన పార్టీ వైస్ ప్రెసిడెంట్ చెన్ను రవీందర్ ఇటీవల ఆఫీసు నుంచి వస్తుండగా మార్గమధ్యంలో రోడ్లు ప్రమాదవశాత్తు బండి అదుపుతప్పి తీవ్రంగా గాయపడిన ఆయనను శనివారం రాఘవ ఎస్టేట్ లోని తన నివాసమునకు కూకట్ పల్లి నియోజక వర్గ జనసేన కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ వెళ్లి పరామర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. రవీందర్ ను పరామర్శించిన వారిలో జనసేన సీనియర్ నాయకులు కొల్లా శంకర్ , గడ్డం నాగరాజు కిషోర్ , కళింగ్ వెంకటరమణ, గంటల నాగభూషణం, పులగం సుబ్బు తదితరులు .


# మదనపల్లి శివాలయం ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



చిన్నారులను సన్మానిస్తున్న ఆంజనేయులు గౌడ్... నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారి

### నృత్యం చేసిన చిన్నారులను సన్మానించిన ఆంజనేయులు గౌడ్

శంషాబాద్, మార్చ్ 9, (ప్రభాత ఉదయం) శంషాబాద్ మండలంలోని మదనపల్లి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా నూతన ఆలయంలో శివలింగ ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. ఐదు రోజులపాటు వాడి వేడిగా పండితుల మంత్రోచ్చారణల మధ్యన జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమాల సందర్భంగా చిన్నారి నృత్య కళాకారులు కుమారి అక్షర, ఇంద్రప్రియ, చూర్ణికా కుమారి, తాన్వీ తమ అద్భుతమైన నృత్యాన్ని ప్రదర్శించారు. హిందూ సాంప్రదాయ ప్రకారం వివిధ రకాల నృత్య ప్రదర్శనలు నిర్వహించిన వారిని గ్రామ మాజీ ఉపసర్పంచ్ పండాల లతా ఆంజనేయులు గౌడ్ గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కళాకారులను ప్రతి ఒక్కరు గౌరవించాలని ఆంజనేయులు అన్నారు. చిన్నతనంలోనే అద్భుతమైన ప్రదర్శనలు ఇస్తున్న వీరిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.



# నల్లగండ్ల సోమేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

### స్వామివారిని దర్శించుకున్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, మార్చి 9 (ప్రభాత ఉదయం) గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల గ్రామంలోని సోమేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ ఆ పరమేశ్వరునికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధతకు,అచంచల విశ్వాసానికి, త్యాగానికి ప్రతీకగా ఉపవాస దీక్షలతో, జాగారాలతో శివరాత్రి పండుగను హిందువులు జరుపుకుంటారని, సృష్టి లయకారునిగా శివున్ని భక్తి ప్రపత్తులతో కొలుచుకుంటారని తెలంగాణ ప్రజలకు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఆ మహాశివుడు ఆయురారోగ్యాలను,సుఖ సంతోషాలను ప్రసాదించాలని జగదీశ్వర్ గౌడ్ ఆ పరమేశ్వరుడిని వేడుకున్నానన్నారు.

# అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

### అధిక సంఖ్యలో అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు

కొత్తకోట, మార్చి9(ప్రభాత ఉదయం) వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానములో మహాశివరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి ఆదిదంపతులైన శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అశేష భక్తజన సందోహం మధ్య వైభవోపేతంగా కళ్యాణోత్సవం జరిగింది. కళ్యాణాన్ని కన్నులారా తిలకించడానికి పరిసర ప్రాంతాల గ్రామాల నుండి భక్తులు వేలాదిగా తరలివచ్చి కళ్యాణం తిలకించారు. మహాశివరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం తెల్లవారు జామున ఐదు గంటలకు భక్తి నిరూపణకు నిదర్శనమైన అగ్నిగుండం కార్యక్రమం ఆలయకమిటి ఏర్పాటు చేశారు. అగ్నిగుండంలో భక్తిశ్రద్ధలతో అధిక సంఖ్యలో భక్తులు నడిచి భక్తిని చాటుకున్నారు . అగ్నిగుండంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో నడవడం విశేషం.


శివపార్వతుల కళ్యాణ్ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు


మహాశివరాత్రి సందర్భంగా ఆలయం ఆవరణలో నిర్వహించిన అగ్నిగుండంలో పాల్గొన్న భక్తులు


మహిళకు చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

# రైతు కుటుంబాలను ఆదుకునేందుకు వివేకానంద సేవ సమితి ముందుకు రావడం అభినందనీయం

### తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్లా శ్రీధర్ బాబు

కూకట్‌పల్లి, మార్చి 9 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి వివేకానంద సేవ సమితి చైర్మన్ సిహెచ్ హన్మంతరావు శనివారం తెలంగాణలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవడానికి వారికీ ఆర్థిక సహాయం అందించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్లా శ్రీధర్ బాబు, శాంతా బయోటెక్నిక్స్ చైర్మన్ కెవి వరప్రసాద రెడ్డి, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రైతు కుటుంబాలను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన వివేకానంద సేవ సమితి చెర్మన్ హన్మంతరావు ను ఆయన అభినందించారు, ఇలాంటి కార్యక్రమం మున్ముందు రాకూడదని, రైతులు ఇకముందు ఆత్మహత్యలు చేసుకోకూడదని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అనంతరంపాపార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలలో నాలుగు గ్యారంటీలు అమలు చేయడం జరిగిందని చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎలక్షన్స్ లో ప్రజలందరూ సహకరించాలని కోరారు. మరింత ప్రజలకు సేవ చేస్తామని, అనేక సంక్షేమ పథకం తీసుకొస్తామని ఈ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.


వడ్డేమాన్ శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్

# శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, మార్చి9(ప్రభాత ఉదయం) శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట గ్రామంలో గల శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో స్వామిని శాసనసభ్యులు జిఎం ఆర్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు స్వామివారి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.



# ప్రజల కోసం పనిచేసే నిబద్ధత కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉంది

### టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి, మార్చి 9 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన మేడ్చెల్ ప్రజా దీవెన సభకు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ నగరం నలువైపుల సమాన అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, పదేండ్ల కల... ప్రజా ప్రభుత్వంలో నెరవేరుతుందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 3 నెలల్లో 25 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, టిపిసిసి కార్యదర్శి గాలి బాలాజీ, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, సుంకన్న, జోజమ్మ, మణి, సుజాత, వాణి, ప్రకాశ్ ముదిరాజ్, అక్బర్, జహంగీర్, మహేష్ గౌడ్, బాలరాజ్ పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు.

# దేవరకద్ర ఎన్ యస్ యు ఐ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శిగా జి.రాఘవ రెడ్డి


ఎన్ ఎస్ యు ఐ దేవరకద్ర ప్రధాన కార్యదర్శిగా రాఘవరెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

దేవరకద్ర, మార్చి9(ప్రభాత హృదయం) దేవరకద్ర నియోజకవర్గం ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శిగా రాఘవరెడ్డి నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు నియోజకవర్గ శాసనసభ్యులు గవినోళ్ళ మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా రాఘవరెడ్డి నియామక పత్రం అందుకున్నారు. సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ యువతను కాంగ్రెస్ పార్టీలో చేరే విధంగా పనిచేయాలని రాఘవరెడ్డికి సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పని చేయాలన్నారు. నియోజకవర్గం ఎన్ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రాఘవరెడ్డి మాట్లాడుతూ... నాపై నమ్మకంతో దేవరకద్ర అసెంబ్లీ ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శిగా దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి నాకు బాధ్యతలు అప్పజెప్పిన సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగవరపు బీచుపల్లి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బోయేజ్, కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ వర్ధన్ రెడ్డి , దేవరకద్ర అసెంబ్లీ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు ముస్తఫా, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గుడిసె, గడ్డివాము దగ్ధం... ఎద్దు మృతి

గద్వాల,మార్చి9(ప్రభాత ఉదయం) ధరూర్ మండల కేంద్రంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసె, గడ్డివాము దగ్ధం కాగ ఎద్దు మృతి చెందింది. వివరాలలోకి వెళితే.. ధరూర్ మండల కేంద్రానికి చెందిన తెలుగు రంగన్న తన వ్యవసాయ పొలం వద్ద పశువుల మేత కోసం పశుగ్రాసం కొనుగోలు చేసి గడ్డివాము ఏర్పాటు చేసుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంచడంతో గడ్డివాముతో పాటు గుడిసె కాలి బూడిదైంది. ఈ ఘటనలో గుడిసెలో ఉన్న ఎద్దు మృతి చెందింది. సుమారు లక్ష వరకు ఆస్థినష్టం సంభవించందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.


అగ్నిప్రమాదంలో బూడిదైన గుడిసె, మృతి చెందిన ఎద్దు


శివాజీ విగ్రహం వద్ద వందేమాతరం యోగ ప్రతినిధులు

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

### యోగ గురువు దేవన్న

కొత్తకోట, మార్చి9(ప్రభాత ఉదయం) యోగ తో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు దేవన్న అన్నారు. శనివారం కొత్తకోట పట్టణ కేంద్రంలో గల శివాజీ విగ్రహం యోగ గురువు దేవన్న ఆధ్వర్యంలో వందేమాతరం యోగా టీం యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.